క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తులు వర్షాలకు ఇబ్బంది పడకుండా ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పర్యవేక్షించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధితురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు 58వ వార్డు పాత రామాలయం వీధిలో ఓ ఇంటి మంటి గోడ శనివారం సాయంత్రం కూలిన సంగతి తెలిసిందే.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పి.గణబాబు ఆదివారం ఆ ప్రదేశానికి వెళ్లి బాధితురాలి పరామర్శించారు. ప్రభుత్వ సాయం వచ్చే విధంగా అధికారులతో మాట్లాడుతానని భరోసా ఇచ్చారు. అనంతరం వార్డులో వర్షం వల్ల పొంగిన గెడ్డలను పరిశీలించారు. గెడ్డకు ఇరుపైపులా గల గోడ ఎత్తు పెంచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్క లక్ష్మణరావుయాదవ్, వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీను, వార్డు కార్యదర్శి పోతాబత్తుల శ్రీను,నర్సింగరావు తదితరులు ఉన్నారు.

హెల్త్ ఎడ్యుకేటర్ల నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన హెల్త్ ఎడ్యుకేటర్ల కార్యవర్గ సభ్యులు

మహారాణిపేట: విశాఖ జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఆదివారం విశాఖ జిల్లాలో హెల్త్ ఎడ్యుకేటర్ల ఆత్మీయ సమావేశం రేసపువానిపాలెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణలో జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలో పని చేస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్లు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా పలాడ శివ ప్రసాద్ (తగరంపూడి పీహెచ్‌సీ), కార్యదర్శిగా సయ్యద్ బేగం (డీఎంహెచ్‌వో), కోశాధికారులుగా పి.సుబ్బలక్ష్మి, ఆర్.ఝాన్సీరాణి, ఉపాధ్యక్షుడిగా రామనాథం, జాయింట్ సెక్రటరీలుగా బి.మంగ, ఎస్.శ్రీనివాసరావు, కార్యనిర్వాహక సభ్యులుగా డి.సత్యవతి, వి.రవి ఎన్నికయ్యారు.

అల్లర్లు సృష్టిస్తే చర్యలు

సీతమ్మధార : ద్వారక పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు సీఐ ఎస్.రమేష్ ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీను ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం వారి వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లర్లు, తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో హాయిగా జీవించాలని సూచించారు.



చాకలిగెడ్డకు రక్షణ గోడ లేకపోవడంతో కాలనీలోకి చేరిన చెత్త, వ్యర్థాలు



కనీస వసతులు లేని ముత్యమాంబకాలనీ

'టిడ్కో' నివాసులకు నరకయాతన

- సౌకర్యాలు కల్పించని అధికారులు
- నాచుపట్టిన ట్యాంక్ నుంచే నీరు సరఫరా
- వీధుల్లో లైట్లు వెలగక అంధకారం
- అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ



కాలనీలో బురద రోడ్లను తలపిస్తున్న సీసీ రోడ్లు



రాజీవ్‌కాలనీలో శుభ్రపరచకుండా వదిలేసిన మంచి నీటి ట్యాంకు (అంతర చిత్రంలో) నీటి కుళాయి నుంచి దోమల లార్వా, నాచు వస్తున్న దృశ్యం

కంచరపాలెం : తాంబూలాలు ఇచ్చాం తన్నుకు చావండి అన్నట్లు... టిడ్కో ఇళ్లు నిర్మించి అర్హులకు అందజేసిన అధికారులు కనీస మౌలిక వసతులు కల్పించకపోవడంతో నివాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. జోన్ – 5 పరిధి జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం ప్రాంతానికి చెందిన రాజీవ్‌కాలనీ, ముత్యమాంబకాలనీ టిడ్కో ఇళ్లకు సంబంధించిన సమస్యలను పట్టించుకునే నాథుడే కనిపించడం లేదని స్థానిక నివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది రాజీవ్‌కాలనీ, ముత్యమాంబ కాలనీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందించారు. సుమారు 564 మంది పట్టాలు అందుకుని పండగ వాతావరణంలో ఇళ్లలోకి ప్రవేశించారు. ఆనాడు పట్టాలు అందించిన జోనల్ అధికారులు తర్వాత అటువైపు కన్నెత్తి చూడలేదు. మంచి నీటి సౌకర్యం, విద్యుత్ లైట్లు, పారిశుద్యం సరిగా లేకపోవడంతోపాటు సీసీ రోడ్లు మట్టి రోడ్లను తలపించే విధంగా ఉండడంతో కాలనీవాసులు నరకయాతన అనుభవిస్తున్నారు.

తాగునీటిలో దోమల లార్వా...

రాజీవ్‌కాలనీ టిడ్కో ఇళ్లలో సుమారు 285 కుటుంబాలు నివసిస్తున్నాయి. జీవీఎంసీ మంచి నీరు సరఫరా చేసే వాటర్ ట్యాంక్ పూర్తిగా నాచుపట్టి ప్రమాదభరితంగా మారింది. ట్యాంక్‌ను శుభ్రపరచకపోవడంతో నాచుపట్టడం, దోమలు లార్వా, గుడ్లు నీటిపై తేలుతున్నాయి. కాలనీ ప్రజలు కుళాయిలు పట్టేటప్పుడు నీటి ద్వారా దోమల లార్వా వస్తోందని... బిందెలు, బకెట్లు, బాటిళ్లలో పట్టి అధికారులు వచ్చేటప్పుడు చూపించేందుకు జాగ్రత్తగా భద్రపరిచామని వాపోతున్నారు. ఫ్రై డే – డ్రై డే నిర్వహణకు శుక్రవారం క్షేత్ర స్థాయిలో పర్యటించే సిబ్బందికి నాచు, లార్వా చూపించినా పట్టించుకోవడం లేదని ఆందోళన చెందుతున్నారు.

అధ్వాన రోడ్లు, వెలగని లైట్లు

రాజీవ్‌కాలనీ, ముత్యమాంబకాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు ప్రవహించే పరిస్థితులు కనిపించడం లేదు. వర్షాలు కురిసేటప్పుడు మురుగునీరు నిల్వ ఉండిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. డెంగ్యూ, మలేరియా జ్వరాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీని ఆనుకుని ఉన్న చాకలిగెడ్డకు రక్షణ గోడ లేకపోవడంతో భారీ వర్షాలు కురిసేటప్పుడు కాలనీల్లోకి చెత్త వచ్చి నిలిచిపోతోంది. మరోవైపు కాలనీల్లో విద్యుత్ స్తంభాలు వేసి, లైట్లు అమర్చకపోవడంతో నిత్యం చీకట్లు కమ్ముకుంటున్నాయి. చీకట్లో రాకపోకలు సాగించాలంటే భయాందోళనగా ఉంటుందని, కాలనీ రోడ్లపై నిలిపిన ఆటోల్లో మందుబాబులు, ఆకతాయిలు చిందులు వేస్తున్నారని పలువురు మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాలనీల్లో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

నీటి ట్యాంకు శుభ్రం చేయాలి

కాలనీలో ప్రజలు తాగే నీటిలో దోమల లార్వా, నాచు వస్తున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో చంటి పిల్లల నుంచి వృద్ధుల వరకు ఆ నీటినే తాగుతున్నాం. ట్యాంకును శుభ్రం చేయమని మంచినీటి సిబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. వర్షాలకు ప్రబలే జ్వరాలకు తోడు ట్యాంకులోని కలుషిత నీటిని తాగడంతో మరిన్ని రోగాల బారిన పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్యాంకును శుభ్రం చేసి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలి.

– పి.ఉమామహేశ్వరి, రాజీవ్‌కాలనీ

మౌలిక వసతులు కల్పించాలి

రాజీవ్‌కాలనీ, ముత్యమాంబ కాలనీల్లో నెలకొన్న సమస్యలపై స్థానిక వార్డు కార్పొరేటర్‌కు ఫిర్యాదులు చేసినా రాజకీయం చేస్తున్నారే తప్ప పట్టించుకోవడం లేదు. కౌన్సిల్‌లో మాట్లాడుతా అంటున్నారే తప్ప... స్థానిక జోనల్ అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేయడం లేదు. మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించాలి. రోడ్లు సరిగా లేకపోవడం, వీధి లైట్లు వెలగకపోవడం, నీటి సమస్యతో నరకయాతన అనుభవిస్తున్నాం.

– ఎన్.జ్యోతికార్తీక, ముత్యమాంబకాలనీ

త్వరలో నూతన కమిటీ ఏర్పాటు



సమావేశంలో పాల్గొన్న యాదవ సంఘాల ప్రతినిధులు,సభ్యులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు జింక్ ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా గల శ్రీకృష్ణ యాదవ కల్యాణమండపంలో ఆదివారం ఏడు వార్డుల పరిధిలోని యాదవ సంఘాల ప్రతినిధులు,సభ్యులు సమావేశం అయ్యారు. సంఘ ప్రతినిధులు, సభ్యులు మాట్లాడుతూ నాటి ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో తమకు ఇక్కడ కల్యాణ మండపం ఏర్పాటుకు సహకరించిందన్నారు. త్వరలో కల్యాణ మండపం నిర్వహణకు సంబంధించి నూతన కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నూతన కమిటీ సారథ్యంలో కల్యాణ మండపం నిర్వహణ సాగుతుందని, వచ్చే ఆదాయం యాదవుల సంక్షేమానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో యాదవ సంఘాల ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా సభ్యత్వ నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న పుట్ట గంగయ్య

మల్కాపురం: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి పుట్ట గంగయ్య పిలుపునిచ్చారు. పార్టీ పశ్చిమ కన్వీనర్ దాడి పురుషోత్తం రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు,కార్యకర్తలు సభ్యత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొలిమేర శ్రీనివాసరావు, దానేశ్వరరావు,బాల రాజేశ్వరరావు,కొక్కిలిగడ్డ విజయ బాబు,పంచదార్ల అప్పలరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానంతోనే ఉపాధ్యాయులకు మేలు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న టీచర్స్ ఫెడరేషన్ నాయకులు

సీతమ్మధార : సీపీఎస్ వ్యతిరేక దినాన్ని పాటిస్తూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆదివారం నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఫెడరేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ 2004లో ప్రవేశపెట్టిన సీపీఎస్ పథకాన్ని రద్దు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉద్యమాలు చేస్తూనే ఉన్నారన్నారు.

గతంలో ప్రవేశపెట్టిన జీపీఎస్ పథకం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కేంద్రంలో మూడో సారి ఏర్పడిన మోదీ ప్రభుత్వం యూపీఎస్ పథకాన్ని ఉద్యోగులకు అమలు చేయాలని చూస్తుందన్నారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌లను వ్యతిరేకిస్తూ ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పథకమే అమలు చేయాలని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణారావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు ఎస్.విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులపై పోలీసుల కొరడా



పూర్ణామార్కెట్ జంక్షన్ వద్ద చలనాలు రాస్తున్న ట్రాఫిక్ పోలీసులు

జగదాంబ : సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు 1వ తేదీ నుంచి వాహన చోదకులపై ఉన్న పాత చలనాలు చెల్లించేలా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. పూర్ణామార్కెట్ జంక్షన్ వద్ద సీఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో ఎస్సై విశ్వనాథం ఆదివారం వాహన చోదకులను తనిఖీ చేశారు. పాత చలానాలు ఉన్న వారి నుంచి నగదు వసూలు చేసి రశీదులు అందించారు. హెల్మెట్ లేని వారిపై అపరాధ రుసుము విధించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్జీ పాలిమర్స్ బాధితుల సమస్యలు పరిష్కరిస్తా



ల్యాండ్ లూజర్స్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: ఎల్జీ పాలిమర్స్‌లో ఉద్యోగాలు కోల్పోయిన వారితో పాటు భూములు ఇచ్చిన వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. వెంకటాపురంలోని ఎల్జీ పాలిమర్స్ ల్యాండ్ లూజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాంట్రాక్ట్ ఉద్యోగులతో ఎమ్మెల్యే గణబాబు ఆదివారం ఆయన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. స్టైరస్ గ్యాస్ లీక్ ప్రమాద ఘటన తర్వాత ఎల్జీ పాలిమర్స్ ఇండియా సంస్థ మూత పడడంతో 375 మంది కాంట్రాక్టు కార్మికులు జీవనాధారం కోల్పోయారని వివరించారు. గ్యాస్ లీక్ తర్వాత 6 నెలల జీతం ఇవ్వడానికి ఒప్పదం జరిగిందని వాపోయారు. ఈ సంస్థను పునఃప్రారంభించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన ఆయన ఈ ఫ్యాక్టరీని పునఃప్రారంభించి ఉపాది అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు.

యుద్ధాలు ఆగితేనే ప్రపంచ శాంతి సాధ్యం



జీవీఎంసీ గాంధీ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార : పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని, ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం నిలిపేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నరసింగరావు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఆశీలుమెట్ట, లలితా జ్యూయలర్స్, ఆర్టీసీ కాంప్లెక్స్, చేపల మార్కెట్, గుడివాడ విగ్రహం మీదుగా శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రపంచంలో సుదీర్ఘ కాలం పాటు రెండు యుద్ధాలు కొనసాగుతున్నాయని, దీనికి ప్రధాన సూత్రధారి అమెరికా సామ్రాజ్యవాదమని విమర్శించారు. యుద్ధాలు ఆపి శాంతి నెలకొల్పాలన్నారు. పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించుకునేందుకు ఇజ్రాయిల్ యుద్ధం ప్రారంభించిందన్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కూడా ఆపాలన్నారు. ప్రపంచ శాంతి కొనసాగితేనే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, జిల్లా నాయకులు పి.మణి, బి.జగన్, కుమార మంగళం, ఎం.సుబ్బారావు, జి.అప్పలరాజు, కె.కుమారి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ భూమిలో ఆక్రమణలు

- స్పందించిన స్టీల్‌ప్లాంట్ అధికారులు
- భూమిని స్వాధీనం చేసుకునే యత్నం
- అడ్డుకున్న స్థానికులు



స్టీల్‌ప్లాంట్ అధికారులతో వాగ్వాదం చేస్తున్న స్థానికులు

పెదగంట్యాడ: భూ వివాదం రాజుకుంది. స్టీల్‌ప్లాంట్ అధికారులతో స్థానికులు వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేట సమీపంలో నడుపూరు గ్రామ సర్వే నెంబర్ 232లో స్టీల్‌ప్లాంట్ స్థలం ఉంది. ఆ స్థలాన్ని ఓ వ్యక్తి ఇటీవల ఆక్రమించాడు. ఆ భూమిలో ఉన్న లక్షలాది రూపాయల విలువైన చెట్లను నరికించేశాడు. ఆ భూమిని చక్కగా చదును చేయించాడు. ఆ స్థలాన్ని క్రీడా మైదానంగా తీర్చిదిద్దాడు. ఆపై మరొకరికి లీజుకు ఇచ్చేశాడు. ఈ నేపథ్యంలో అక్కడ జరుగుతున్న తతంగంపై స్థానికులు పెద్ద ఎత్తున స్టీల్‌ప్లాంట్ భూసేకరణ అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో స్పందించిన స్టీల్‌ప్లాంట్ భూసేకరణ అధికారులు శనివారం పరిశీలించారు. సర్వే చేసి ఆ స్థలం స్టీల్‌ప్లాంట్‌కు చెందినది నిర్ధారించుకున్నారు. తర్వాత అక్కడ సర్వే రాళ్ల పాతించారు. ఆపై అక్కడ మొక్కలు నాటేందుకు సిద్ధమయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న భూ కబ్జాదారులు అధికారులను అడ్డుకున్నారు. ఆ స్థలం తమదేనంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. స్థానికులు అడ్డగించడంతో స్టీల్‌ప్లాంట్ అధికారులు వెనుదిరిగారు. ఈ స్థలం విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, ఆక్రమణకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలి



సీతమ్మధార రైతుబజారు పక్క రోడ్డులో పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ సెక్రటరీ కీర్తి, అధికారులు

సీతమ్మధార: రోడ్లపై ఎప్పటికప్పుడు చెత్త తొలిగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని వీఎంఆర్‌డీఏ సెక్రటరీ, జోన్ – 3 స్పెషల్ ఆఫీసర్ డి.కీర్తి ఆదేశించారు. ఆదివారం ఆమె జోన్ – 3 పరిధిలో పర్యటించారు. సీతమ్మధారలోని రైతుబజారు పక్కనే గల రోడ్డు, ఆక్సిజన్ టవర్స్ పక్కనే ఉన్న గెడ్డను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున ఎప్పటికప్పుడు చెత్త ఎత్తివేయాలని, దోమలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, పారిశుధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గెడ్డల్లో చెత్త నిలిచిపోకుండా చర్యలు చేపట్టాలన్నారు.

సినీ పరిశ్రమ విశాఖ తరలి రావాలి

డాబాగార్డెన్స్: ఏపీ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్‌గా కంచర్ల అచ్యుతరావు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సినీ నిర్మాత,ఫెడరేషన్ చైర్మన్‌గా నియమితులైన కంచర్లను ఫెడరేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కంచర్ల మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయినా ఇంకా తెలుగు పరిశ్రమ తెలంగాణకే పరిమితం అయిపోయిందన్నారు. సినీ పరిశ్రమ ద్వారా వచ్చే ఆదాయం మొత్తం తెలంగాణకు వెళ్లిపోతుందన్నారు. సినీ పరిశ్రమ విశాఖకు తరలి రావాలని, ఇక్కడ ఫిల్మ్ ఛాంబర్ ఏర్పాటు చేయాలన్నారు. సెన్సార్ బోర్డుని కూడా ఇక్కడే నెలకొల్పాలన్నారు.

సంగీతం.. విశ్వవ్యాప్తం



తోలుబొమ్మలాట ప్రదర్శన



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎం.ఎస్ఎన్.రాజు, డాక్టర్ గుమ్మలూరి రాంబాబు

మద్దిలపాలెం: పారా... ద సుప్రీమ్ 7వ వార్షికోత్సవం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులు కళాభారతి ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ గుమ్మలూరి రాంబాబు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంగీత విద్వాంసురాలు డాక్టర్ పంతుల రమ స్థాపించిన ఈ సామాజిక, సాంస్కృతిక చైతన్య గీతిక ఏడేళ్లుగా ఎన్నో కార్యక్రమాల ద్వారా ప్రజల్లో సంగీతంపై అవగాహన, ఆసక్తిని కల్పిస్తున్నాయన్నారు. గతంలో స్వచ్ఛ స్వర, స్వర 2 రాగ, స్పందన వంటి వినూత్న కార్యక్రమాలతోపాటు సంగీతానికి సంబంధించిన ఎన్నో ముఖ్య అంశాలపై శిక్షణ శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

అలరించిన తోలుబొమ్మలాట

వేడుకల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వర తోలుబొమ్మలాట బృందం ప్రదర్శించిన రామాయణంలోని మైరావణ చరిత్ర కథ ఘట్టం అందరినీ అలరించింది. తోలుబొమ్మలాటలో సంగీతంపై పరస్పర చర్చ రసవత్తరంగా సాగింది. అనంతరం నిర్వహించిన కృతి సమీక్షలో సంగీత విద్యార్థులు, రసజ్ఞులు కర్ణాటక సంగీత రచనల్లోని సంగీతం, సాహిత్యంపై విశ్లేషణాత్మక ప్రదర్శనలు చేశారు. వీరంతా బరంపూర్, ఢిల్లీ, గోరక్‌పూర్ ప్రాంతాల నుంచి రావడం విశేషం. సమీక్షలో పాల్గొన్న వారిని పంతుల రమ, పంతుల గోపాలరావులు ప్రశంసించారు. సంగీత విద్వాంసులు, సంగీత సుధానిధి గురువిల్లి అప్పన్న నాదస్వర కచేరీతో వేడుకలు ముగిశాయి. కంచి కామకోటి పీఠ ఆస్థాన విద్వాంసుడు గురువిల్లి దుర్గారావు డోలుపై సహకరించారు. ఎంతో శ్రావ్యమైన, ఆనందభరితమైన నాదస్వర–డోలు కచేరీ రసజ్ఞులను మంత్రముగ్ధులను చేసింది.